www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 29 డిసెంబర్ 2024
5
అన్నమయ్య

## పంచాయతీ అభివృద్ధికి సాయమందించండి

**- రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి సర్పంచ్ హబీబ్‌బాషా వినతి**

**ప్రజాశక్తి-పీలేరు**

పీలేరు గ్రామ పంచాయతీ అభివృద్ధికి సాయం కోసం రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలను కలసి కోరినట్లు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా తెలిపారు. సర్పంచ్ శనివారం ఎంపీ, మాజీ మంత్రిని తిరుపతిలో వారి స్వగృహంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీలేరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి తమ వంతు సహాయ, సహకారాలు అందివ్వాలని రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం సభ్యులు మిథున్ రెడ్డిని కోరానన్నారు. అందుకు ఎంపీ స్పందిస్తూ పట్టణ ప్రజల సామూహిక అవసరాలను వార్డు సభ్యులతో కలిసి గుర్తించి ప్రతిపాదనలను సిద్ధం చేసి తీసుకురావాలని చెప్పారన్నారు. ముఖ్యంగా ప్రజల అత్యవసర సమస్యలైన మురుగునీటి కాలువలు, తాగునీరు, రోడ్లు వంటి అసరాలపై దృష్టి పెట్టి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారన్నారు. ఎంపీని కలిసిన వారిలో వార్డు సభ్యులు ఆబిద్ ఉన్నారు.

# విషాదం

పొలంలో విగత జీవులుగా పడివున్న రైతు కుటుంబం

నాగేంద్ర, భార్గవ్, గాయత్రి, వాణి, (ఫైల్‌ఫోటో)

ఆ రైతుకు వచ్చిన కష్టం పగవాడికి కూడా రావొద్దు. ఎంతో శ్రమించి పంటను పండించుకున్నప్పటికీ ఆ రైతుకు కష్టాలే మిగిలాయి. తన వద్ద ఉన్న ఎకరన్నర పొలంతో వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో వేరే వారి పంటను కౌలుకు తీసుకున్నాడు. ఎంతో కష్టపడి పంటను సాగు చేశాడు. తన శక్తికి మించి అప్పులు చేసిన మరి పంట సాగు చేశాడు. చివరకు ఆ రైతుకు అప్పులే మిగిలాయి తప్ప పంట చేతికి రాని పరిస్థితి. ఏం చేయాలో తెలియక ఓ కఠిన నిర్ణయానికి వచ్చాడు ఆ రైతు. తాను లేకపోతే తన కుటుంబం కూడా ఆగమవతదని భావించాడో ఏమో కుటుంబంతో సహా ఆ రైతు చేసిన పని తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. కడప జిల్లాలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది.

- అప్పులబాధ తాళలేక రైతు కుటుంబం ఆత్మహత్య
- దంపతులు, ఇద్దరు పిల్లల మృతి
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన కలెక్టర్



మృతుల బంధువులతో మాట్లాడుతున్న కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్

**ప్రజాశక్తి-సింహాద్రిపురం/పులివెందుల టౌన్**

సింహాద్రిపురంలో విషాదం చోటు చేసుకుంది. సింహాద్రిపురం మండలం దుద్దేకుంట గ్రామంలో నాగేంద్ర అనే రైతు కుటుంబం అప్పులబాధతో శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. అప్పుల బాధ తాళలేక అన్నదాత కుటుంబం బలవన్మరణానికి పాల్పడింది. గ్రామానికి చెందిన నాగేంద్రకు సొంతంగా ఒకటిన్నర భూమి ఉంది. సొంత భూమితో పాటు 15 ఎకరాలు వేరే వారి భూములను కౌలుకు తీసుకున్నాడు నాగేంద్ర. పొలాన్ని సాగు చేసేందుకు మితిమీరి అప్పు కూడా చేశాడు. అప్పులు చేసి సాగు చేసిన పంటలో భారీ నష్టం రావడంతో రైతు కృంగిపోయాడు. ఏం చేయాలో తెలియని స్థితిలో ఉండిపోయాడు. మరోవైపు అప్పు తీర్చే మార్గం లేక.. అప్పులు కట్టాలని ఒత్తిడి ఎక్కువవడంతో మానసికంగా నలిగిపోయాడు. చివరకు తనకు చావే శరణ్యం అని భావించాడు ఆ రైతు. తాను చనిపోతే తన కుటుంబం ఇబ్బందులు పడుతుందని భావించిన కొమ్మెర నాగేంద్ర(40) భార్య వాణి(38) కుమారుడు భార్గవ్(13) కుమార్తె గాయత్రి(12) తనతో పాటే తీసుకెళ్లాలని నిర్ణయించాడు. ఈ విషయాన్ని భార్యకు చెప్పగా ఆమె కూడా ఎంతో మనోవేదనకు గురైంది. చివరకు ఆత్మహత్య చేసుకోవాలనే ఆ దంపతులు నిర్ణయించుకున్నారు. నాగేంద్ర, వాణి దంపతులతో వారి ఇద్దరు పిల్లలకు కూడా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ముందుగా పిల్లలకు ఉరివేసిన తరువాత దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. పంట చేను గేటుకు ఉరి వేసుకుని అన్నదాత కుటుంబం బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది. నాగేంద్ర కుటుంబం ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడకు చేరుకుని నలుగురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రైతు కుటుంబం ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాలకు శనివారం సాయంత్రం వారి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

### అప్పులు అధికం కావడంతోనే మృతి

అప్పులు అధికం కావడంతోనే తనతో పాటు కుటుంబ సభ్యులందరూ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుంది. తనకు ఉన్న 1.42 ఎకరాల పొలంలో చీనీ సాగు చేస్తున్నారు. మరో 15 ఎకరాలు గుత్తకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో గుత్తకు తీసుకున్న పొలం నుంచి ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతో పాటు పెట్టుబడి వ్యయం పెరిగి అప్పుల పాలయ్యారు. ఈ క్రమంలో దాదాపు రూ.20 లక్షల బయటి వ్యక్తుల నుంచి అప్పులు తీసుకున్నట్లు తెలిసింది. తనకు ఉన్న 1.42 ఎకరాల పొలాన్ని ప్రకాష్‌రెడ్డి అనే వ్యక్తికి రూ.7 లక్షలు తీసుకొని రిజిస్టర్ చేసినట్లు తెలిసింది. బ్యాంకులో సైతం రుణం తీసుకున్నారు.

### కుటుంబం మృతి చెందడం బాధాకరం : పవన్‌కల్యాణ్

నాగేంద్ర అనే రైతు కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం దారుణమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఆత్మహత్యకు గల కారణాలను అన్వేషించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆత్మహత్యకు మ్యుటేషన్‌కు సంబంధించిన వ్యవహారమా, లేక అప్పులబాధ ఏమైనా ఉందా, లేక ఇతరుల ప్రమేయం ఏమైనా ఉన్నదా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

### జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత దిగ్భ్రాంతి

దిద్దేకుంటలో రైతు కుటుంబం ఆత్మహత్యపై ఇన్‌ఛార్జి మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైతు కుటుంబం బలవన్మరణం బాధాకరమన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రైతు కుటుంబం ఆత్మహత్యపై కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి సవిత హామీ ఇచ్చారు.

### మృతుల కుటుంబ సభ్యులకు కలెక్టర్ పరామర్శ

నలుగురు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. పులివెందుల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆత్మహత్య చేసుకున్న వారి మృతతదేహాలను పరిశీలించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సంఘటన గల కారణాలను పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్‌ను అడిగి తెలుసుకున్నాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో నష్టం రావడం, గత నాలుగు సంవత్సరాలుగా విపరీతంగా అప్పులు చేయడం వలన సంఘటన జరిగినట్లు తెలుస్తుందన్నారు. కారణం ఏదైనా ఒకే కుటుంబంలో నలుగురు కుటుంబ సభ్యులు బలవన్మరణం చెందడం చాలా బాధాకరమైన విషయమని పేర్కొన్నారు.

పులివెందుల ఆస్పత్రిలో మృతదేహాలను పరిశీలిస్తున్న కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్

# అధికారులకు అండగా ఉంటాం

**- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**
**- కడప రిమ్స్‌లో ఎంపిడిఒకు పరామర్శ**

కడప రిమ్స్‌లో ఎంపిడిఒ జవహర్‌బాబును పరామర్శిస్తున్న డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

**ప్రజాశక్తి-కడప ప్రతినిధి/గాలివీడు/రాయచోటి**

కూటమి ప్రభుత్వంలో అధికారులపై దాడులు చేస్తే సహించేది లేదని ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వైసిపి నాయకుడు సుదర్శన్‌రెడ్డి దాడిలో గాయపడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపిడిఒ జవహర్‌బాబును పవన్ కళ్యాణ్ అధికారులతో కలిసి శనివారం పరామర్శించారు. అనంతరం గాలివీడుకు వెళ్లి ఎంపిడిఒ కార్యాలయాన్ని పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ధైర్యం చెప్పారు. కడప, గాలివీడులో ఆయన మీడియాతో మాట్లాడుతూ చాలా కార్యక్రమాలను రద్దు చేసుకొని వచ్చాను. తలుపులు మూసి ఎంపిడిఒపై దాడి చేయడం దారుణమన్నారు. ముఠాలతో భయపెడితే..మాది భయపడే ప్రభుత్వం కాదని తెలిపారు. మార్పు కోసమే ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకొన్నారని తెలిపారు. అభివృద్ధికి ఎవరు అడ్డుగోడలు కట్టినా బద్దలుగొట్టే శక్తి మాకుందన్నారు. దాడి చేసినవారు ఎక్కడున్నా లాక్కొచ్చి జైల్లో పడేస్తామన్నారు. దాడికి పాల్పడిన సుదర్శన్‌రెడ్డి అనుచరులు అందరినీ జైలుకు పంపిస్తామని చెప్పారు. సోషల్ మీడియాలో పిచ్చి కూతలు కూసినా తీవ్ర పరిణామాలు ఎదర్కోవాల్సి ఉం టుందని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగిపై వైసిపి నేత దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ అధికారులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకునే ప్రభుత్వం తమది కాదని హెచ్చరించారు. ఆధిపత్యం, అహంకారంతో జరిగే దాడులను అడ్డుకుంటామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కులాలకు సంబంధించిన అధికారులపై దాడులు చేస్తే ఉపేక్షించేది లేద`న్నారు. ఎంపిడిఒపై దాడి హేయనీయమైన చర్య అని పేర్కొన్నారు. ఎంపిడిఒ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.. రిటైర్డ్ అయినా కూడా వదిలిపెట్టమని ఎంపిడిఒ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఇలాంటి ఘటనలను సహించేది లేదన్నారు. పోలీసులే కాదు జనం కూడా ఇలాంటి దాడులపై వాటిపై స్పందించాలని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఇప్పటికే ఎస్‌పికి ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎంపిడిఒపై దాడి చేసిన ఒక న్యాయవాది అని, చట్టాలు తమకు తెలుసని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లా కలెక్టర్లు డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, చామకూరి శ్రీధర్, రైల్వేకోడూరు, కమలాపురం ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, ఉమ్మడి జిల్లాల ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, జిల్లా పరిషత్ సిఇఒ ఓబులమ్మ, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి పాల్గొన్నారు. రాయచోటిలోని స్టేట్‌గెస్ట్ హౌస్‌కు వచ్చిన పవన్ కల్యాణ్‌కు పలువురు ఘన స్వాగతం పలికారు. అధికారులతో పాటు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి సుగువాసి ప్రసాద్ బాబు, టిడిపి యువ నాయకులు మండపల్లి లక్ష్మి ప్రసాద్‌రెడ్డి, పలువురు పవన్ కళ్యాణ్‌కు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎంపిడిఒ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న పవన్‌కల్యాణ్

### ఎంపిడిఒను ఫోన్‌లో పరామర్శించిన హోం మంత్రి అనిత

వైసిపి నేతల దాడిలో గాయపడిన గాలివీడు ఎంపిడిఒ జవహర్ బాబుకు హోంమంత్రి వంగలపూడి అనిత ఫోన్ చేసి పరామర్శించారు. విధి నిర్వహణలోని అధికారిపై పిడిగుద్దులతో విరుచుకుపడిన ఘటనను కూటమి ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వం మారినా కడప జిల్లాలో నేటికీ అధికారులు, సామాన్యులపై దాడులు జరుగుతుండడం వైసిపి నాయకుల అహంకారానికి, ఆధిపత్య ధోరణికి నిదర్శనమన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలోకి ప్రవేశించి, అధికారి గొంతుపైనే కాలేసి తొక్కి, నానా దుర్భాషలాడి పిడిగుద్దులతో విచక్షణరహితంగా దారుణంగా ప్రవర్తించిన వారందరినీ వదలమని పేర్కొన్నారు. ఎంపిడిఒకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటు ఒదని, భద్రత ఏర్పాట్లు చేస్తామని ఫోన్‌లో మాట్లాడి భరోసానిచ్చారు. ఎస్‌పి విద్యాసాగర్ నాయుడికి హోంమంత్రి ఫోన్ చేసి ఎంపిడిఒపై దాడి ఘటనకు సంబంధించిన తాజా వివరాలను అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వారిపై అవసరమైతే రౌడీషీట్ తెరవడానికి వెనకాడబోమని అనిత హెచ్చరించారు.

### దాడి చేసిన వారిపై హత్య కేసు నమోదు

ఎంపిడిఒ జవహర్‌బాబుపై దాడికి పాల్పడిన జల్లా సుదర్శన్‌రెడ్డిపై హత్యాయత్నం, ఎస్‌సి, ఎస్‌టి కేసును గాలివీడు పోలీసులు నమోదు చేశారు. ఎస్ఐ రామకృష్ణ మీడియాకు వెల్లడించిన మేరకు...సుదర్శన్‌రెడ్డి, గడ్డం చంద్ర ప్రకాష్‌రెడ్డి, జెసిపి రమణారెడ్డి, వెంకటరెడ్డి, భానుమూర్తిరెడ్డి, నూలివీడు రామానుజన్‌రెడ్డి, గరుగుపల్లి రామానుజన్‌రెడ్డి, తూముకుంట ఆంజనేయులురెడ్డి, తూముకుంట పాపిరెడ్డిగారిపల్లి చెందిన బయ్యారెడ్డి, తుమ్ముకుంట మరికుంటపల్లికి చెందినబయారెడ్డి, ధనుంజయరెడ్డి, రెడ్డిశేఖర్, సి.ప్రభాకర్, ధర్మారెడ్డిపై కేసు నమోదు చేశారు.

కలికిరి : ఎంపిడిఒపై దాడిని ఖండిస్తూ నిరసన తెలియజేస్తున్న అధికారులు

### ఎంపిడిఒపై దాడి అమానుషం

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

గాలివీడు ఎంపిడిఒ జవహర్ బాబుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ నిమ్మనపల్లి ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎపిఎం మురళి, ఎపిఒ రమేష్, ఎంపిడిఒ, ఉపాధి హామీ, గృహ నిర్మాణ శాఖ కార్యాలయం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపిడిఒ జవహర్ బాబుపై వైసిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, అతని అనుచరులతో కలిసి ఎంపిపి చాంబర్ తాళాలు ఇవ్వనందుకు దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ అధికారులపై దాడులకు పాల్పడే వారిపైన ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.కార్యక్రమంలో ఎపిఒ రమేష్, ఎపిఎం మురళి, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది నవాజ్ ఖాన్, రవి కుమార్, ఇర్ఫాన్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు. **కలికిరి:** గాలివీడు ఎంపిడిఒపై దాడి చేసింది వారిని కఠినంగా శిక్షించాలని ఎంపిడిఒ భానుమూర్తి రావు ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి పి.భానుమూర్తి రావు మాట్లాడుతూ ఎంపిడిఒ పైన దాడి అనేది హేయమైన చర్య అని, నింది తులపై వెంటనే తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **సుండుపల్లి:** దళితుడైన గాలివీడు ఎంపిడిఒ జవహర్ బాబుపై వైసిపి నాయకులు దాడి చేయడం హేయమైన చర్యని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు బండి ఈశ్వర్ పేర్కొన్నారు. అధికారులపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని కోరారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. **రామసముద్రం :** ఎంపిడిఒపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ దాడి హేయమైన చర్య అని తెలిపారు. నిందితులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చిన్నాస్వామి, స్థానికం రాజేష్, బిసిసెల్ వెంకటరమణ, మండల మాల మహానాడు అధ్యక్షులు కృష్ణప్ప, ఎస్‌సి సెల్ అధ్యక్షులు బాలజీ, నాగరాజ, మురగన్, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

# విద్యా పరిరక్షణే ఎస్‌ఎఫ్‌ఐ ధ్యేయం

- నాణ్యమైన విద్య అందించేందుకు పోరాటాలు
- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలో పలువురు వక్తులు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

బిజెపి అధికారంలోకి రాగానే రెండు కోట్ల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామన్న ప్రధాని నరేంద్ర మోడీ గద్దెనెక్కిన వెంటనే నిరుద్యోగులను తీవ్రంగా మోసగించిందని పలువురు వక్తలు మండిపడ్డారు. విద్యా పరిరక్షణ చేపట్టి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేవరకు ఎస్‌ఎఫ్‌ఐ పోరాటాలు చేస్తుందని పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభను జిల్లా కార్యదర్శి నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక జ్ఞానోదయ గ్రౌండ్ నుంచి సభా ప్రాంగణం జిఆర్‌టి పాఠశాల వరకు మహార్యాలీ నిర్వహించారు. జిఆర్‌టి పాఠశాలలో నిర్వహించిన బహిరంగ సభలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరమేష్, సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు, జెవివి రాష్ట్ర కన్వీనర్ హరినాథ్‌శర్మ, అడ్వకేట్ సోమశేఖర్, యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు సుధాకర్ నాయుడు, రవి ప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యను ప్రభుత్వం కార్పొరేట్ పరం చేయడానికి ప్రయత్నాలు సాగిస్తోందని పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. విద్యను ఉచితంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అయితే ప్రభుత్వాలు మాత్రం విద్యను ప్రైవేట్ పరం చేయడానికి కార్పొరేట్ వ్యక్తులైన అంబానీ, అదానీలకు దోచిపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. విద్యను ప్రైవేట్ పరం చేస్తే ఖబడ్దార్ ఎస్‌ఎఫ్‌ఐ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. విద్యా హక్కుల సాధన కోసం ఎస్‌ఎఫ్‌ఐ పోరుబాట సాగిస్తుందని, ఇందుకు ప్రతి ఒక్కరూ కదిలి రావాలని పిలుపునిచ్చారు. మదనపల్లెలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహా సభలకు విద్యార్థులను పంపేందుకు ప్రైవేట్ కళాశాలల యజమాన్యం సుముకం చూపకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ సభలకు వెళ్తే విద్యార్థుల్లో చైతన్యం పెరిగి, ప్రశ్నించే తత్వం వస్తుందని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం విద్యార్థులను సభకు పంపకుండా ఇబ్బంది పెట్టినా వందల సంఖ్యలో విద్యార్థులు తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ కాలేజీలు, విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కొరబడ్డాయని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రద్దు చేశారని, ఫీజురీయింబర్స్ మెంట్ ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు తల్లికి వందనం ఇవ్వలేదని, దీనిపై నాయకులు ఒక్కమాట మాట్లాడకపోవడంపై వారి వైఖరి ఎంటో చెప్పాలని నిలదీశారు. మంచి చదువు చదువుకున్నా, ఉద్యోగాలు లేక డబ్బు సంపాదన కోసం విద్యార్థులు ఆన్ లైన్ బెట్టింగ్, ఆన్ లైన్ ట్రేడింగ్, జూదాలు, తదితర చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను నిర్లక్ష్యం చేయడం కార్పొరేట్ కు దోచిపెట్టడం వంటి విధానాలతో విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతోందన్నారు. విద్యార్థులు సంఘటితమై పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని, ఎస్‌ఎఫ్‌ఐ శాస్త్రీయమైన విధానంలో పోరాడేందుకు చక్కని వేదికన్నారు. విద్యా సమస్యలపై నిత్యం పోరాటాలు చేస్తూ, మెరుగైన విద్య అందే వరకూ పోరాడుతుందన్నారు. కార్పొరేట్ శక్తులను పూర్తిగా రద్దుచేసి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. మదనపల్లెలో ఏర్పాటవుతున్న మెడికల్ కాలేజ్‌ను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని, ఇందుకు ఎస్‌ఎఫ్‌ఐ చూస్తూ ఊరుకోదన్నారు. వెంటనే మెడికల్ కాలేజీ పనులను వేగవంతంగా పూర్తిచేసి కాలేజ్ను ప్రభుత్వమే కొనసాగించాలన్నారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి ఎస్‌ఎఫ్‌ఐ ఉద్యమం చేపడుతుందని డిమాండ్ చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయని వెంటనే వాటిని భర్తీ చేయాలని అంతవరకు నిరుద్యోగ భృతి చెల్లించి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. యువగళం పాదయాత్ర లో నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రవేశ పెట్టాలన్నారు. మదనపల్లెలో ఐటి హబ్ ఏర్పాటు చేసి బిటెక్ విద్యార్థులకు ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. విద్యా రంగంలో సమూల మార్పులు చేసి కార్పొరేట్ వ్యవస్థ లేకుండా, ప్రతి మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ, నియోజకవర్గంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని తెలి పారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాల నాయ కుల, జిల్లా నలు మూలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు, పలువురు పాల్గొన్నారు.

బహిరంగ సభలో అభివాదం చేస్తున్న నాయకులు

బహిరంగ సభకు హాజరైన విద్యార్థులు

# ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుందాం

**- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎస్.నాయుడు**

మాట్లాడుతున్న ఎస్.ఎస్.నాయుడు

**ప్రజాశక్తి-రాయచోటి**

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకునేందుకు యుటిఎఫ్ నిరంతరం పోరాడుతోందని ఫెడరేషన్ కార్యదర్శి ఎస్.ఎస్. నాయుడు తెలిపారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార యాత్రలు జరుగుతున్న సందర్భంగా శనివారం రాయచోటిలో ప్రచార యాత్రను ఆయన ప్రారంభిం చారు. ఈ జాత రాయచోటి నుండి బయలుదేరి గుర్రంకొండ, అంగళ్ళు, మదనపల్లి, వాయల్పాడు, పీలేరు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడలో జనవరి 5, 6, 7, 8వ తేదీల్లో స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ బడిని రక్షించుకోవడం, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడమే ధ్యేయంగా యుటిఎఫ్ మహాసభలు జరుగుతున్నాయని, ఉపాధ్యాయులంతా ఈ సభలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబిర్ మాట్లాడుతూ భవిష్యత్తు కాలంలో ఉపాధ్యాయుల సమస్యల సాధన కొరకు తీర్మానలు ప్రవేశ పెట్టి విస్తృతంగా చర్చలు జరిపి వాటి సాధన కొరకు ప్రణాళిక రూపందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, సహధ్యక్షులు శివారెడ్డి, కోశాధికారి చంద్ర శేఖర్, జిల్లా కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, దావద్దీన్, ఆదినారాయణ, పురం వెంకటరమణ, అక్రమ్ బాషా, రాష్ట్ర కౌన్సిలర్లు చెంగలరాజు, శివారెడ్డి, ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ సురేంద్రరెడ్డి, ప్రచురణాల విభాగం కన్వీనర్ విజయ్ కుమార్, మున్సిపల్ కమిటీ కన్వీనర్ సుధాకర్, సీనియర్ నాయకులు రహిమాన్, ఉత్తన్న, సాబీర్ బాషా, రవి ప్రకాష్, ఆడిట్ కమిటీ సభ్యులు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **మదనపల్లి :** యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల ప్రచార జాత శనివారం స్థానిక ఎన్‌జిఒ హోం వద్దకు చేరుకుంది. యుటిఎఫ్ జెండాను జిల్లా గౌరవాధ్యక్షులు సుధాకర్ నాయుడు ఆవిష్కరించారు. పట్టణంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు.

## హేయం

ప్రజాదృష్టి

దేశానికి పట్టెడన్నం పెట్టేది రైతే. అటువంటి రైతు పురుగుల మందును పెరుగన్నంలా తీసుకుని విగతజీవిగా మారిపోతున్నాడు. దుర్భర దారిద్ర్య పరిస్థితులను రూపు మాపేదెన్నడో తెలియడం లేదు. ప్రతి ఏటా రైతు ఆత్మహత్యల సంఖ్య పెరుగుతున్నదే తప్పా తగ్గడం లేదు. దుర్విధానాలకు చెల్లు చీటీలు రాసే రోజుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఏళ్లకు ఏళ్లు కరిగిపోతున్నాయో తప్పా, రైతు మేలిమి విధానాలకు మొగ్గతొడగడం లేదు. కడప జిల్లా వ్యవసాయ ఆధాకారి ప్రాంతం. ఇటువంటి ప్రాంతంలో వ్యవసాయం దండగామారి మరణమృదంగం ప్రతిధ్వనిస్తోంది. అంతుబట్టని నేపథ్యం అరణ్యరోదనగా మారి దిక్కుల్ని పిక్కటిల్ల జేస్తోంది. కానీ పాలకుల విధానాల్లో మార్పు రావడం లేదు. రైతు ఆత్మహత్యకు పాల్పడితే ఘటనకు దారి తీసిన పైన గల కారణాలను ఆరా తీయడంతో సరిపెట్టడానికి పరిమితం కావడం విషాదకరం. బలవన్మరణాలకు కారణం వ్యవసాయ విధానాలు కారణమనే సంగతిని విస్మరించడమే. డబ్ల్యుటిఒలో దేశీయ రైతు ప్రయోజనాల్ని బలిపీఠంపైకి ఎక్కించినందు వల్లే మరణ మృందంగాలకు కారణమనే సంగతిని పక్కదారి పట్టిపోతున్నది. ఉద్దేశపూర్వక దుర్విధానాలకు స్వస్తి పలికితేనే రైతు రాజు అవుతాడనే సంగతి అందరికీ తెలిసీ, గప్‌చుఫ్‌గా వెళ్లిపోవడం విషాదకరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతా సుఖీభవ పేరుతో ఇవ్వాల్సిన ఖర్చులు సైతం చెల్లించకుండా మీనమే షాలు లెక్కిస్తుండడం ఆందోళనకరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా తరహాలో రైతులకు ఆరురకాల సబ్సిడీలను ఇవ్వడం తరహాలో ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపిడిఒ జవహర్‌బాబుపై దాడి ఘటన బాధాకరం. దళిత అధికారిపై ఎంపిపి గది తాళాలు ఇవ్వకపోవడంపై గదిలో బందించి కొట్టడం వంటి మూక స్వామ్య తరహా దాడులు క్షేమకరం కాదు. నిందితుడు న్యాయవాది కూడా కావడం దిగజారుతున్న ప్రమాణాలకు నిదర్శనమని చెప్పవచ్చు. చట్టాలు, న్యాయశాస్త్రాల్ని చదివిన విద్యావంతుడు ఇలా బరితెగించడం తగదు. ప్రభుత్వ విధుల్లో ఉన్న దళిత అధికారిపై పాశవికంగా దాడి చేయడం క్షంతవ్యం కాదు. దీనిపై పోలీసులు చురుకుగా వ్యవహరించి ఉండాలి. ఎంపిడిఒ జవహర్‌బాబు ఫోన్ చేసిన వెంటనే స్పందించి ఉంటే ఇంతటి అనర్థానికి అవకాశం ఉండేది కాదు. ప్రభుత్వం స్పందన చూసిన అనంతరం పోలీసులు సీరియస్‌గా స్పందించడం, నిందితుడిని అదుపులోకి తీసుకోవడం వరకు బాగానే ఉంది. నేటికీ దాడి ఘటనకు సంబంధించిన పలువురు నిందితులు బయటే ఉండడం గమనార్హం. ఏదేమైనా భవిష్యత్‌లో ఇటువంటి దాడి ఘటనలకు అవకాశం లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**- ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

విద్యార్థికి నగదు బహుమతిని అందిస్తున్న హిందీ ఉపాధ్యాయుడు

## విద్యార్థినికి నగదు బహుమతి అందజేత

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల పరిధిలోని టి.కమ్మపల్లి జడ్‌పి హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమ్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలో హిందీ సబ్జెక్టులో 100కి 93 మార్కులు సాధించిన పదవ తరగతి విద్యార్థిని కె.అమృతకు వెయ్యి రూపాయలు ప్రోత్సాహక బహుమతి అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బబిత మాట్లాడుతూ 93 మార్కులు సాధించిన విద్యార్థిని అభినందించారు. హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో కూడా మంచి మార్కులు సాధించాలన్నారు. 90 పైగా మార్కులు తెచ్చుకున్న వారికి నగదు బహుమతి అందిస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నదానం గొప్పది

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

వృద్ధులకు భోజనాన్ని అందిస్తున్న కృష్ణవేణి

పిటియం మండలం, పట్టెంవాండ్లపల్లెకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు హరీష్ భార్య క్రిష్ణవేణి పుట్టినరోజు సందర్భంగా శనివారం బెంగుళూరు లోని విజన్ ఇండియా ఆశ్రమంలో 60 మంది వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తగాది రాజ శేఖర్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో ఇండియా ఫౌండేషన్ ఎల్లప్పుడు ముందు ఉంటుందని చెప్పారు. సభ్యుల కుటుంబాల లోని శుభ కార్యాలకు ఆశ్రమాల్లో అన్నదానం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజలకు మంచి చేయడమే తమ ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో క్రిష్ణవేణి, హరీష్, భాగ్యమ్మ, రాజు పాల్గొన్నారు.

## గొప్ప ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థికవేత్త అని రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు పేర్కొన్నారు. శనివారం రాజంపేట ఏరియా ఆసుపత్రిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయన చేసిన పలు అభివృద్ధి పనులు, సేవలను గుర్తుచేసుకొని నివాళి అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ మాధవరెడ్డి, డాక్టర్ అబ్బుభకర్, డాక్టర్ అమృత, డాక్టర్ నాగలక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

## ఉనికి కోసమే వైసిపి ఆందోళన డ్రామా : టిడిపి

**ప్రజాశక్తి-పీలేరు**

రాష్ట్రంలో వైసిపి ఉనికి కోసమే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆందోళన డ్రామా ఆడిస్తున్నారని పీలేరు టిడిపి నాయకులు ఆరోపించారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా 2023-24 సంవత్సరానికి విద్యుత్ చార్జీలు పెంచడానికి ఇవి తెచ్చుకున్న అనుమతులు కాదా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వంలో 9సార్లు విద్యుత్ చార్జీలు పెంచి, మరోసారి పెంచడానికి అవసరమైన అనుమతి తెచ్చుకున్న జగన్మోహన్ రెడ్డికి ప్రజలు జీవితాంతం గుర్తుండేలా గుణపాఠం చెప్పారని అన్నారు. విద్యుత్ చార్జీలు పెంచారని రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేయాలంటూ జగన్మోహన్ రెడ్డి కార్యకర్తలకు పిలుపు ఇవ్వడం చూస్తుంటే, వారు పెంచిన చార్జీలపై వారే ధర్నాలు, నిరసనలు చేయడం వైసిపి అవినీతికి అద్దం పడుతోందని అన్నారు. విద్యుత్ చార్జీలు భారీగా పెంచుతూ ప్రజలపై పెనుభారం మోపారని ఈ పాపం ఆయన దేనని చెప్పారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదని అన్నారు. ఈ సమావేశంలో మండల టిడిపి కన్వీనర్ వారణాసి శ్రీకాంత్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి మైనార్టీ నాయకుడు డాక్టర్ మల్లెల రెడ్డిబాషా, మాజీ కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం నాయకులు కోటపల్లి బాబురెడ్డి, బిసి నాయకులు పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర పాల్గొన్నారు.

## రూ.96 లక్షలతో సిసి రోడ్లు, డ్రెయినేజీ పనులు : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

పట్టణంలో రూ. 96 లక్షల మున్సిపల్ నిధులతో సిసి రోడ్లు, డ్రెయినేజీ పనులను ఎమ్మెల్యే షాజహాన్ బాషా శనివారం భూమిపూజ చేసి ప్రారంభించారు. పట్టణంలోని 2, 3, 8, 10, 32, 34 వార్డులలో చైర్ పర్సన్ వి.మానూజా రెడ్డితో కలిసి సిసి రోడ్లు, డ్రెయినేజీ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలతో మదనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి పూర్తిగా కుంటు పడిందన్నారు. వైసిపి కౌన్సిలర్ల విజ్ఞప్తి మేరకు పట్టణంలోని పలు వార్డులలో అసంపూర్తిగా మిగిలిపోయిన సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాజకీయాల కతీతంగా పట్టణాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ఇప్పటికే పట్టణంలో సిటిఎం రోడ్డు విస్తరణ పనులు చేపట్టామని, వార్డుల్లో సైతం మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యస్తున్నామన్నారు. అనంతరం చైర్ పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ పట్టణ సమగ్రాభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలను వేగవంతం చేశామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో మదనపల్లి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కమిషనర్ కె.ప్రమీల, కౌన్సిలర్లు కరీముల్లా, శివయ్య, నాగార్జున బాబు, టిడిపి నాయకులు బొమ్మిశెట్టి పురుషోత్తం, యర్రబలి వెంకటరమణారెడ్డి,రాటకొండ శ్రీనివాసులు నాయుడు, రఘుపతి నాయుడు, మధు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

# రెడ్డిపల్లె రోడ్డుకు మోక్షమెన్నడో?

- చినుకు పడితే చిత్తడేచిత్తడి
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, పాదచారులు
- కాలువలు లేకే సమస్య అంటున్న స్థానికులు
- పట్టని అధికారులు

**ప్రజాశక్తి-పుల్లంపేట**

రోడ్లపై నిలిచిన మురుగు నీరు

మండల పరిధిలోని రెడ్డిపల్లి పంచాయతీలో రెడ్డిపల్లి సచివాలయం నుంచి అరుంధతివాడ వరకు వెళ్లే రోడ్డు అద్వానంగా ఉందని, చినుకుపడితే రోడ్డంతా చిత్తడి చిత్తడి మారడంతో ఆ దారిలో వెళ్లాంటే భయంగా ఉందని వాహనదారులు, పాదచారులు పేర్కొంటున్నారు. పంచాయతీ కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దాదాపు ఐదేళ్లగా సమస్యలను పరిష్కరించాలని అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే లేరని వాపోయారు. గత వైసిపి పాలనలో ఇదిగో, అదిగో అంటూ కాలయాపన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు నిర్మించి ఇరుపక్కలా కాలువలు ఏర్పాటు చేయక పోవడంతో మురుకునీరు రోడ్ల పైకి చేరుతోందని అన్నారు. రోడ్డుపై మురుగు నీరు నిలిచి ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయని చినుకు అన్నారు. చిన్నారులు, వృద్ధులు విషజ్వరాల బారిన పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్లపై ఉన్న మురుగు నీటిని తొలగించి, శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## సబ్సిడీ సిలిండర్ల అక్రమ వినియోగంపై కొరడా

సిలిండర్లను సీజ్ చేస్తున్న తహశీల్దార్, సిఎస్‌డిటి

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

పట్టణంలో సబ్సిడీ సిలిండర్లు వినియోగిస్తున్న 26 సిలిండర్లను సీజ్ చేసి 6ఎ నోటీసులు జారీ చేసి జరిమానా విధించినట్లు తహశీల్దార్ మహమ్మద్ అన్సారీ, సిఎస్‌డిటి వెంకట్ రెడ్డి తెలిపారు. విఆర్‌ఒలతో కలిసి పట్టణంలో తనిఖీలు చేపట్టారు. హోటళ్లు, టీ దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులకు మంజూరు చేసిన సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వ్యాపారస్తులు వినియోగించడం చట్ట విరుద్ధమని అన్నారు. ఈ అంశంపై గతంలో అటు వ్యాపారులు, ఇటు ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. సిలిండర్లు సరఫరా చేసేవారు సబ్సిడీ సిలిండర్లను వినియోగదారులకు మాత్రమే అందించాలని, లేనియెడల వారి పైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో జూనియర్ అసిస్టెంట్ ఖలీద్, విఆర్‌ఒలు మల్లికార్జున పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

**మాధురి ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ రేపన సుధాకర్**

కరాటేలో బహుమతులు అందుకున్న మాధురి స్కూల్ విద్యార్థులు

పాఠశాలలో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్‌ఫూల్

**ప్రజాశక్తి-సుండుపల్లి**

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతోనే మాధురి ఇంగ్లీష్ మీడియం పాఠశాలను నిర్వహిస్తున్నామని పాఠశాల కరస్పాండెంట్ రేపన సుధాకర్ తెలిపారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని అన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన వసతులను ఇటీవల తనిఖీకి వచ్చిన డిఇఒ సుబ్రహ్మణ్యం చూసి సంతృప్తి వ్యక్తం చేశారని, విద్యార్థుల క్రమశిక్షణను అభినందించారని తెలిపారు. నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించామని చెప్పారు.

డిఇఒ సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న కరస్పాండెంట్ (ఫైల్ ఫోటో)

సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం పాఠశాల బస్సును కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం 8వ తరగతి వరకు పాఠశాల కొనసాగుతోందని, 9వ తరగతి ఏర్పాటు చేయడానికి డిఇఒ వచ్చి పరిశీలించి వెళ్లారని అన్నారు. త్వరలో 9వ తరగతిని విద్యార్థులకు అందుబాటులోకి తీసుక వస్తామని చెప్పారు. విద్యార్థులతో చదువుతో పాటు క్రీడల్లో కూడా అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని అన్నారు. విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెంచేందుకు ప్రత్యేకంగా సమయాన్ని కేటాయిస్తున్నామి తెలిపారు. పాఠశాలలో స్విమ్మింగ్ ఫూల్ ఏర్పాటు చేసి ఆసక్తి కలిగిన విద్యార్థులకు స్విమ్మింగ్‌లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఇటీవల తిరుపతిలో జరిగిన కరాటే పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు తక్కువ ఫీజుతోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించేలా శబ్ద కాలుష్యానికి దూరంగా పాఠశాలను ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థుల క్రమశిక్షణ, నడవడికను డిఇఒ అభినందించారని, క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని చెప్పారని అన్నారు. డిఇఒతో పాటు ఎంఇఒలు వెంకటేశ్వర్ నాయక్, రవీంద్రనాయక్ పాఠశాలలోని వసతులు, విద్యార్థుల నైపుణ్యతను పరిశీలించారని తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

**ప్రజాశక్తి-పుల్లంపేట**

ప్రజా సమస్యల పరిష్కార వేదికగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పుల్లంపేట తహశీల్దార్ అరవింద్ కిషోర్ తెలిపారు. శనివారం రెడ్డిపల్లె సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో సామాజిక సమస్యల పట్ల ప్రజలు స్పందించి విన్నపాలు అందించాలని కోరారు. వీటిలో భూ వివాదాలు, భూ సమస్యలు, మ్యుటేషన్, భూముల సరిహద్దు సమస్యలపై పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకుండా రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు వివరించారు. రెడ్డిపల్లె రెవెన్యూ సదస్సులో మొత్తం 53 అర్జీలు అందాయని వాటిలో 39 రెవెన్యూ ,1 రేషన్ కార్డు, 8 పెన్షన్,2 అగ్రికల్చరల్, గృహ నిర్మాణం కోసం 3, సంబంధించిన అర్జీలు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీ ప్రసన్న, ఆర్ఐ సుశీల్‌కుమార్, విఆర్ఒ రాధా, మండల సర్వేయర్ శ్రీరాములు, రొంపిచర్ల మురళి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు హాజరైన తహశీల్దార్, రెవెన్యూ అధికారులు

విద్యార్థులకు జ్ఞాపిక, సర్టిఫికెట్లను అందిస్తున్న నరసింహారెడ్డి

## సైన్స్ ప్రదర్శనలతో విజ్ఞానం, వికాసం

**ప్రజాశక్తి-రాయచోటి**

సైన్స్ ప్రదర్శనలతో విద్యార్థుల్లో విజ్ఞానం, వికాసం పెంపొందుతుందని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని సందీప్ స్కూల్‌లో కలామ్స్ విజన్-2024 ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్ కుమార్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న సైన్స్ ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలన్నారు. ఇలాంటి సైన్స్ ప్రదర్శన నిర్వహించడం వలన విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ అంశాలపై అవగాహనతో పాటు చదువు మీద ఆసక్తి కలుగుతుందని అభిప్రాయపడ్డారు. అనంతరం ప్రతిభ గల విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ప్రతిభ కళాశాల కరస్పాండెంట్ శివగంగిరెడ్డి, లయన్స్ క్లబ్ రాయచోటి వ్యవస్థాపక అధ్యక్షులు, జిఎంటి కో-ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, న్యాయ నిర్ణేతలు ఆంజనేయులు, రాజేంద్రప్రసాద్, ప్రకాష్‌రెడ్డి, సందీప్ స్కూల్ కరస్పాండెంట్ వెంకట్రామిరెడ్డి, జగన్మోహన్ రెడ్డి, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలి

**పుల్లంపేట** :మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీసేలా సైన్స్ లోని వివిధ ప్రాజెక్టులను తయారు చేస్తూ సృజనాత్మక కృత్యాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఉపాధ్యాయుడు రమణ తెలిపారు. 4,5 తరగతి విద్యార్థులు అట్టముక్కలతో స్మార్ట్ ఫోన్ తయారుచేసి అందులో వివిధ యాప్స్ గీసి రంగులు వేయడం జరిగిందని, చూడడానికి అచ్చమైన మొబైల్ ఫోన్ లాగే ఉండే ఆ బొమ్మ ముచ్చటగా ఉందని అన్నారు. చిన్న అట్టపెట్టెతో ప్రథమ చికిత్స పెట్టెను తయారు చేశారని, ప్రథమ చికిత్సకు ఉపయోగించే వివిధ వస్తువులను ఉంచడం జరిగిందని పేర్కొన్నారు. ప్రథమ చికిత్స పెట్ట ప్రతి పాఠశాలలో ఉండాలని ఆది విద్యార్థుల చేత ఇలా తయారుచేస్తే వారు సంతోషిస్తారని పేర్కొన్నారు. ప్రతి శనివారం విద్యార్థులలోని సృజ నాత్మకతను వెలికి తీసేలా ఒక కృత్యాన్ని ప్రతి విద్యార్థి చేత చేయిస్తామని తెలిపారు.

## డిప్యూటీ సిఎంను కలిసిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మర్యాద పూర్వకంగా కలిశారు. వైసిపి నాయకుల దాడిలో గాలివీడు ఎంపిడిఒను శనివారం పరామర్శించడానికి వచ్చిన పవన్‌ను ఎమ్మెల్యే పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారం పోయినా వైసిపి నాయకులకు అహంకారం తగ్గలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హుందాగా వ్యవహరించడం, ప్రజల సమస్యలపై సత్వరం స్పందించే మనస్తత్వం కలిగిన గొప్ప నాయకుడు పవన్ కల్యాణ్ అని కితాబిచ్చారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఇఒ ఆధ్వర్యంలో తాగునీటి బోరు వేస్తున్న సిబ్బంది

## తాగునీటి సమస్యకు పరిష్కారం

**ప్రజాశక్తి-కలికిరి**

మండల కేంద్రం కలికిరి క్రాస్ రోడ్డులో నివాసమున్న ప్రజలకు తాగునీటి సమస్య తీరనుంది. పట్టణం లోని క్రాస్ రోడ్, సిద్ధార్థ స్కూల్ పరిసర ప్రాంతం, లేపాక్షి రైస్ మిల్ పరిసర ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తడంతో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో టిడిపి యువ నాయకులు రెడ్డివారి యోగేష్ రెడ్డి, కలికిరి మేజర్ పంచాయతీ ఇఒ అశోక్ తాగునీటి సమస్య పరిష్కారం కోసం లేపాక్షి అలీ రైస్ మిల్ సమీపంలో బోరు వేయగా శనివారం సాయంత్రం నీరు పుష్కలంగా పడ్డాయని తెలిపారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ పట్టణంలో ఎవరికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని, ఎవరికి ఎలాంటి సమస్య వచ్చిందా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**ప్రజాశక్తి-చిన్నమండెం**

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రిసోర్స్ పర్సన్స్ నాగేశ్వరరావు, నాగరాజులు పేర్కొన్నారు. మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహహింస, వరకట్న వేధింపులు, మహిళల పట్ల క్రూరత్వం, లైంగిక వేధింపులు, అపహరణ, యాసిడ్ దాడి, అత్యాచారం, గ్యాంగ్ రేప్, మహిళలకు సమాన పనికి సమాన వేతనం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఫ్యాక్టరీల చట్టం, అనైతిక ట్రాఫిక్ చట్టం 1956, మహిళల ఫిర్యాదులను పరిష్కరించడంలో ఎన్‌సిడబ్ల్యు పాత్ర, విధులు, మహిళల మనోవేదనలను పరిష్కరించడంలో నల్సా పాత్రపై వివరించారు. మానవ అక్రమ రవాణా, వన్ స్టాప్ సెంటర్(సఖి), లక్ష్యాలు అప్లికేషన్, ఎమర్జెన్సీ రెస్పాన్స్, రెస్క్యూ సర్వీసెస్, వైద్య సహాయం, పోలీస్ సహాయంపై సూచనలు చేశారు. ఆర్థిక అక్షరాస్యత, నైపుణ్య అభివృద్ధి పథకాలు, ప్రధానమంత్రి జన్ ధన్ యోజనతో పాటు ప్రభుత్వ పథకాలపై వివరించారు. ఉచిత న్యాయ సహాయం కొరకు నల్సా లీగల్ ఎయిడ్ హెల్ప్ లైన్ నంబర్ 15100, ఆన్లైన్ మోడ్ ద్వారా న్యాయ సహాయ దరఖాస్తు మొదలగు అంశాలను వివరించారు. కార్యక్రమంలో చిన్నమండెం శేఖర్ నాయక్, మహిళలు పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు విచారణలో నిర్లక్ష్యం తగదు

**ప్రజాశక్తి-పీలేరు**

మాట్లాడుతున్న శ్రీనివాసులు

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు విచారణలో అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో- కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణికుమార్ తెలిపారు. శనివారం పీలేరు పట్టణంలోని బాస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు విచారణలో అధికారుల నిర్లక్ష్య వైఖరిపై మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాటల్లాడుతూ పీలేరు నియోజకవర్గం, కలకడ మండలం, ఎనుగొండపాళ్యం పంచాయతీ, బండమీదపల్లి ఎస్‌సి కాలనీకి చెందిన యాకల రెడ్డెప్పపై అదే గ్రామంలోని అగ్ర కులానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కుల దురహంకారంతో దాడి చేశారన్నారు. తీవ్ర పరుష పదజాలంతో దూషించి, దాడికి పాల్పడిన మహేష్ నాయుడు, ప్రసాద్ నాయుడు, వీరాంజనేయులు నాయుడులపై ఈనెల 19న కలకడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి పది రోజులు కావస్తున్నా ఇంతవరకు సంబంధిత అధికారులు బాధిత రెడ్డెప్ప కుటుంబాన్ని విచారించకపోవడంలో అధికారుల ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఇకనైనా సంబంధిత పోలీస్ శాఖ బాధిత రెడ్డెప్ప కుటుంబానికి రక్షణ కల్పించి, విచారణ వేగవంతం చేసి, నిందితులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో త్వరలో చలో రాయచోటి కార్యక్రమానికి పిలుపునిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బాస్ నాయకులు ఎర్రబల్లి మల్లికార్జున, ముల్లంగి గురవయ్య, మాలమహానాడు నాయకులు జెట్టి దుర్గా ప్రసాద్, తుమ్మల రవిచంద్ర పాల్గొన్నారు.

# క్రైం కార్నర్

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**ప్రజాశక్తి-కలికిరి**

రోడ్డు ప్రమాదంలోమహిళ మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని రెడ్డివారిపల్లి గ్రామం, అండేకురవపల్లి దళితవాడకు చెందిన జంగం వెంకటరమణ భార్య రాణెమ్మ(60) శుక్రవారం రాత్రి ఇంటివద్ద నుంచి పాలు తీసుకొని రావడానికి ఊరిలోని చిల్లర అంగడికి రోడ్డుకు ఎడమవైపున నడుచుకుంటూ వెళుతుండగా పవన్ కళ్యాణ్ అనే వ్యక్తి అజాగ్రత్తగా నడుపుకుంటూ నడుచుకుంటూ వెళ్తున్న రానెమ్మ ను ఢీనడంతో రోడ్డుపైన పడిపోయిందని అన్నారు. స్థానికులు బాధితురాలిని ఆటోలో తీసుకుని కలికిరి ప్రభుత్వ ఆసుపత్రి లో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కొడుకు సురేంద్ర ఫిర్యాదు మేరకు, సిఐ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధురాలు..

**బి.కొత్తకోట** : ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. కోటావూరు పంచాతీ, చౌటకుంటపల్లి గ్రామంలో నివాసమున్న పెద్దరెడ్డెప్ప భార్య ఒలిపి.చెంచమ్మ(75) అనే వృద్ధురాలు ఆవు దూడను తీసుకొని గ్రామ సమీపంలో వేత మేపడానికి వెళ్లిందని అన్నారు. అక్కడ ఉన్న బల్లెనిచెరువులో నీటి కోసం వెళ్లి ప్రమాదశాత్తు నీటిలో పడి మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ బి.రెడ్డప్ప నాయక్ తెలిపారు.

## భార్య అలిగి వెళ్లిందని భర్త ఆత్మహత్య

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

భార్య అలిగి పుట్టింటికి వెళ్లిందని భర్త ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. రెండవ పట్టణ సిఐ రామచంద్ర కథనం మేరకు.. నీరుగట్టువారిపల్లె గజ్జలకుంటకు చెందిన శ్రీనివాసులు (30) భార్య విజయలక్ష్మి భర్త తో గొడవపడి అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాసులు ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న టూ టౌన్ ఎస్ఐ రహీం ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆటో బోల్తా : విద్యార్థులకు తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

ఆదర్శ పాఠశాల విద్యార్థులను ఇంటికి తరలిస్తున్న ఆటో పరసతోపు వద్ద బోల్తా పడి 8 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం సాయంత్రం జరిగిన సంఘటనపై పోలీసులు కథనం మేరకు .. తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లికు చెందిన విద్యార్థులు పలువురు ఆదర్శ స్కూల్లో చదువుతున్నారు. సాయంత్రం స్కూల్ వదలగానే ఆటోలో ఇంటికి వెళ్తుండగా మార్గం మధ్యలోనే పరుశతోపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లాస్య, యక్షిత, అనిల్ కుమార్‌రెడ్డి, పూర్ణిమ, హర్షిత, మౌనిక గాయపడ్డారని చెప్పారు. లిఖిత్, మహమ్మద్ నవీన్‌కు తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్సలు అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మదనపల్లెకు జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.